# 179 బిడ్లు.. రూ.56.74 కోట్లు

## చిన్నతరహా ఖనిజాల మొదటి దశ వేలం పూర్తి

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చిన్న తరహా ఖనిజాల మొదటి దశ వేలం విజయవంతంగా పూర్తయినట్టు గనుల శాఖ ప్రకటించింది. దీనిలో భాగంగా మూడు ఖనిజాలకు సంబంధించిన 25 బ్లాకుల్లో 19 బ్లాకులకు ఈ నెల 23 నుంచి 27 వరకు నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో రూ.56.74 కోట్లకు బిడ్లు దాఖలైనట్టు వెల్లడించింది. వీటిలో ఓ కలర్ గ్రానైట్ బ్లాక్ (3.61 హెక్టార్లు)తోపాటు 4 లాటరైట్ బ్లాకులు (15.834 హెక్టార్లు), 14 స్టోన్ అండ్ మెటల్ బ్లాకులు (47.125 హెకార్లు) ఉన్నట్టు వివరించింది. వీటి రిజర్వు ధర రూ.5,63,62,600గా నిర్ణయించగా.. తుది బిడ్ మొత్తం రూ.56,74,12,600గా ఉన్నట్టు తెలిపింది. మొత్తం 179 బిడ్లు దాఖలైనట్టు పేర్కొన్నది. ఇక ప్రతినెలా ఖనిజాల వేలం నిర్వహించాలని భావిస్తున్నది.

### వేలం వేసిన ఖనిజాల వివరాలు

| ఖనిజం | వేలం వేసిన బ్లాకులు | టీక్యూబీల సంఖ్య | రిజర్వు ధర (రూ.) | తుది బిడ్ మొత్తం (రూ.) |
|---|---|---|---|---|
| కలర్ గ్రానైట్ | 1 | 5 | 29,04,000 | 4,99,79,000 |
| లాటరైట్ | 4 | 39 | 63,33,600 | 15,89,58,600 |
| స్టోన్ అండ్ మెటల్ | 14 | 84 | 4,71,25,000 | 35,84,75,000 |
| మొత్తం | 19 | 128 | 5,63,62,600 | 56,74,12,600 |

# గ్రాన్యూల్స్ లాభం 152 కోట్లు

హైదరాబాద్, మే 28: ప్రముఖ ఫార్మా దిగ్గజం గ్రాన్యూల్స్ ఇండియా నికర లాభంలో 17 శాతం వృద్ధిని కనబరిచింది. ఫార్ములేషన్ విభాగంలో అమ్మకాలు భారీగా పుంజుకోవడంతో గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.152 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.130 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.1,176 కోట్ల నుంచి రూ.1,197 కోట్లకు పెరిగినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.4,482 కోట్ల ఆదాయంపై రూ.501 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని గడించింది. మరోవైపు రూ.1 ముఖ విలువ కలిగిన షేరుకు రూ.1.5 తుది డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

# పారిశ్రామికానికి బీటలు

## ఎనిమిది నెలల కనిష్ఠస్థాయికి పడిపోయిన వృద్ధి

- ఏప్రిల్ నెలలో 2.7 శాతంగా నమోదైన ఐఐపీ
- గతేడాదితో పోలిస్తే పడిపోయిన ప్రగతి



నూఢిల్లీ, మే 28: పారిశ్రామికం మళ్లీ పడకేసింది. ఆర్థిక వృద్ధిలో నాలుగో స్థానానికి చేరుకోనున్నట్టు గొప్పలు చెప్పుకుంటున్న నరేంద్ర మోదీ సర్కార్‌కు పారిశ్రామిక ప్రగతి రూపంలో గట్టి షాక్ తగిలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే ఢీలాపడింది. రికార్డు స్థాయిలో పెరుగుతూ వచ్చిన పారిశ్రామిక ప్రగతికి బ్రేకులు పడ్డాయి. తయారీ రంగంతోపాటు గనులు, విద్యుత్ రంగాలు నిరాశాజనక పనితీరు కనబర్చడంతో ఐఐపీ ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఏప్రిల్ నెలలో కేవలం 2.7 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 5.2 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. మార్చి నెలలో నమోదైన వృద్ధి రేటును మళ్లీ సవరించింది. గతంలో 3 శాతంగా ఉంటుందని అంచనాను విడుదల చేసిన గణాంకాల శాఖ ఈసారి దీనిని 3.9 శాతానికి సవరించింది.

### ఢీలా పడిన తయారీ, గనులు

దేశ వృద్ధి, పారిశ్రామిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్న తయారీ రంగంలో నిస్తేజం ఆవహించింది. గత కొన్ని నెలలుగా పరుగులు పెట్టిన తయారీ రంగం వెనుకంజవేసింది. గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి 3.4 శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 4.2 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. దీంతోపాటు గనుల రంగంలో వృద్ధి ప్రతికూలానికి పడిపోయింది. దేశవ్యాప్తంగా ఉన్న గనుల్లో ఖనిజ ఉత్పత్తి గణనీయంగా పడిపోవడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గత నెలకుగాను ఈ రంగంలో వృద్ధి మైనస్ 0.2 శాతానికి పడిపోయింది. అంతక్రితం ఏడాది ఇది 6.8 శాతంగా నమోదైంది. అలాగే విద్యుత్ రంగంలో వృద్ధి ఒక్క శాతానికి పరిమితమైంది. ఏప్రిల్ 2024లో ఇది 10.2 శాతంగా ఉన్నది.

### క్యాపిటల్ గూడ్స్ సెగ్మెంట్ ఫర్వాలేదు..

ఇతర రంగాలతో పోలిస్తే క్యాపిటల్ గూడ్స్ రంగం అంచనాలకుమించి రాణించింది. గత నెలలో ఈ రంగంలో వృద్ధి 20.3 శాతంగా నమోదైంది. ఏడాది క్రితం ఇదే నెలలో నమోదైన 2.8 శాతంతో పోలిస్తే భారీగా పెరిగింది. ఏడాది క్రితం ఇదే నెలలో 10.5 శాతం వృద్ధిని కనబరిచిన కన్స్యూమర్ డ్యూరబుల్ విభాగం ఈసారికిగాను 6.4 శాతంతో సరిపెట్టుకున్నది. మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగాలు కూడా పడకేశాయి. ఈ రెండు విభాగాలు నాలుగు శాతం వృద్ధితో సరిపెట్టుకున్నాయి. గతేడాది వచ్చిన వృద్ధి 8.5 శాతంతో పోలిస్తే సగానికి సగం పడిపోయింది. ప్రాథమిక వస్తువులు 0.4 శాతం మాత్రమే కనబరిచాయి.

### కీలక రంగాలది అదే దారి


కీలక రంగాలు ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఏప్రిల్ నెలకుగాను ఎనిమిది నెలల కనిష్ఠ స్థాయికి పడిపోతూ 0.5 శాతంగా నమోదైంది. క్రూడాయిల్, సహజ వాయువు రంగాలు ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కారణం. ప్రతీకార సుంకాలపై అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో గతేడాది 4.6 శాతంగా నమోదైన వృద్ధి ఈసారి తిరోగమన బాటపట్టింది.



| రంగం | ఏప్రిల్-2025 | ఏప్రిల్-2024 |
|---|---|---|
| పారిశ్రామిక ప్రగతి | 2.7% | 5.2% |
| తయారీరంగ వృద్ధి | 3.4% | 4.2% |
| గనుల రంగ వృద్ధి | -0.2% | 6.8% |
| విద్యుత్ రంగం | 1% | 10.2% |
| ఇన్‌ఫ్రాస్ట్రక్చర్/నిర్మాణ రంగం | 4% | 8.5% |
| ప్రాథమిక వస్తువుల అవుట్‌పుట్ | -0.4% | 7% |

# రెండోరోజూ నష్టాల్లో సూచీలు

ముంబై, మే 28: స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు నష్టపోయాయి. ఎఫ్‌ఎంసీజీ రంగ సంస్థ ఐటీసీ షేరు కుదేలవడం మొత్తం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. ఒక దశలో 300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 239.31 పాయింట్లు కోల్పోయి 81,312.32 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్‌ఎస్ఈ నిఫ్టీ 73.75 పాయింట్లు కోల్పోయి 24,752.45 వద్ద స్థిరపడింది. ఈవారంలోనే జీడీపీ గణాంకాలతోపాటు పారిశ్రామిక సూచీ విడుదలకానుండటంతో మదుపరులు అప్రమత్తకు మొగ్గుచూపారు. ఫలితంగా ఎఫ్‌ఎంసీజీ, వాహన, ఫార్మా రంగ షేర్లు పతనం చెందగా..బ్యాంకింగ్, పీఎస్‌యూ, మీడియా, ఎనర్జీ రంగ షేర్లు కదంతొక్కాయి. బ్రిటిష్ మల్టినేషనల్ బీఏటీ సంస్థ ఐటీసీలో తన వాటాను 2.5 శాతం మేర తగ్గించుకుంటున్నట్టు ప్రకటించడంతో ఐటీసీ షేరు కుప్పకూలింది. ఒక దశలో ఐదు శాతానికి పైగా నష్టపోయిన షేరు చివరకు 3 శాతం నష్టపోయింది. దీంతోపాటు ఇండస్ఇండ్, నెస్లే, అల్ట్రాటెక్, మహీంద్రా, పవర్‌గ్రిడ్, ఏషియన్ పెయింట్స్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా షేర్లు పతనం చెందాయి. కానీ, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా ఎఫ్‌ఎంసీజీ 1.33 శాతం నష్టపోగా, మెటల్, వాహన, కన్జ్యూమర్ డ్యూరబుల్, కమోడిటీస్ షేర్లు దిగువముఖం పట్టాయి. కానీ, ఆర్థిక సేవలు, ఇండస్ట్రియల్స్, టెలికాం, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.



# డీ-మెర్జ్ కానున్న బీఏఎస్ఎఫ్

హైదరాబాద్, మే 28: ప్రముఖ పురుగుల మందుల తయారీ సంస్థ బీఏఎస్ఎఫ్..దేశీయ మార్కెట్లోకి మరో రెండు రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకొచ్చింది. వరి పంటపై వచ్చే పాముపొడ తెగులు నివారణ కోసం వాలెక్సియోతోపాటు సుడి దోమను నియంత్రించే శిలీంద్రనాశిని మిబెల్యాను ప్రవేశపెట్టినట్టు కంపెనీ బిజినెస్ డైరెక్టర్ గిరిధర్ తెలిపారు. వీటిలో వాలెక్సియో 60 ఎంఎల్ ధర రూ.1,750గాను, మిబెల్యా 120 ఎంఎల్ ధర రూ.1.090గా నిర్ణయించింది. వ్యాపార విస్తరణలో భాగంగా వచ్చే మూడు నుంచి నాలుగేండ్లలో ప్రతియేటా 2 ఉత్పత్తుల చొప్పున 10 రకాల కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తుల విభాగాన్ని వేరుచేసే ప్రక్రియ కొనసాగుతున్నదని, వచ్చే 18 నుంచి 24 నెలల్లో ఇది పూర్తికానున్నట్టు చెప్పారు.

# ఎస్బీఐ 26 వేల కోట్ల రైటాఫ్

## 2024-25లో భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేసిన బ్యాంకింగ్ దిగ్గజం






న్యూఢిల్లీ, మే 28: ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు ప్రైవేట్ బ్యాంకులు భారీ స్థాయిలో రుణాలను రైటాఫ్ చేశాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ప్రభుత్వరంగ బ్యాంకుల కన్నా ప్రైవేట్ రంగ బ్యాంకులు అన్ సెక్యూర్డ్ రుణాలను పెద్దమొత్తంలో రైటాఫ్ చేశాయి. వీటిలో దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) అత్యధికంగా రూ.26 వేల కోట్లకు పైగా రుణాలను తన బ్యాలెన్స్ షీట్స్ నుంచి తీసివేసింది. అంతక్రితం ఏడాది రైటాఫ్ చేసిన రూ.17,645 కోట్లతో పోలిస్తే ఇంచుమించు రూ.10 వేల కోట్లకు పెరిగాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులతో పోలిస్తే ప్రైవేట్ బ్యాంకులు అధిక మొత్తంలో రుణాలను రైటాఫ్ చేయడం విశేషం. గతేడాది ఐసీఐసీఐ బ్యాంక్ రూ.9,271 కోట్ల రుణాలను తన ఖాతా పుస్తకం నుంచి తొలగించింది. 2023-24లో రైటాఫ్ చేసిన రూ.6,091 కోట్ల కంటే ఇది 50 శాతం అధికం. అలాగే యాక్సిస్ బ్యాంక్ కూడా రూ.11,833 కోట్ల మొండి బకాయిలను తన ఖాతాలోంచి తీసివేసింది.

### ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రుణాలే..

చిన్నస్థాయి రుణాలు తీసుకొని ఎగ్గొట్టే వారు అధికంగా ఉంటున్నారని రిజర్వు బ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. వీటిలో ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రంగాల్లో అత్యధికంగా ఉంటున్నాయని, వీటిని తగ్గించడానికి బ్యాంకులు పెద్దగా చర్యలు తీసుకోవడం లేదని హెచ్చరిస్తున్నది. పూచీకత్తు లేకుండా బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు ఇస్తున్నాయని, వీటి వల్ల ఆయా సంస్థల ఆర్థిక స్థితిగతులపై ప్రతికూల ప్రభావం పడనున్నదని గతంలోనే రిజర్వు బ్యాంక్ హెచ్చరించింది. అయినప్పటికీ బ్యాంకులు రుణాలు ఇవ్వడం మానడం లేదు. కఠిన నిబంధనలు విధించడం వల్ల బ్యాంకుల రుణ వితరణకు బ్రేక్‌లు వేయవచ్చునని, దీనివల్ల చిన్న వ్యాపారాలు, వ్యక్తులు, రుణాలు పొందడం కష్టతరం కానున్నది. అయినప్పటికీ గడిచిన మూడేండ్లలో రైటాఫ్ అయిన రుణాల్లో 20 శాతం రికవరి కావడం విశేషం.

# గోదావరి వద్ద ఉద్రిక్తత

## రెండు గ్రామాల మత్స్యకారులకు నచ్చజెప్పిన పోలీసులు



మత్స్యకారులకు నచ్చజెప్పుతున్న ఎస్ఐ సాయికుమార్

దస్తురాబాద్, మే 28 : చేపల వేట రెండు గ్రామాల మత్స్యకారుల మధ్య వివాదం రాజుకుంది. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని భూత్కూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంపూర్ శివారులో గోదావరి వద్ద బుధవారం రాంపూర్, దస్తురాబాద్ గ్రామాల మత్స్యకారులు చేపల వేటకు వెళ్లారు. ఒకేసారి రావడంతో రెండు గ్రామాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దస్తురాబాద్ మత్స్యకారులు గోదావరిలో చేపలు పట్టడానికి వీలు లేదని గోదావరిలోకి రాకుండా మాకే హక్కు ఉందని రాంపూర్ గ్రామస్తులు అడ్డుగా ఉన్నారు. చేపలు పట్టడానికి వెళ్తున్న దస్తురాబాద్ మత్స్యకారులను గొడవ జరుగకుండా ఘటనా స్థలానికి వెళ్లి సీఐ అజయ్, ఎస్ఐ సాయికుమార్, సిబ్బంది అడ్డుకొని శాంతిపజేశారు కాగా తహసీల్ కార్యాలయం లో తహసీల్దార్ విశ్వంబర్, సీఐ అజయ్, మత్స్యశాఖ అధికారి విజయ్ కిరాంకర్, ఇరువర్గాల చర్చలు జరిపారు. గోదావరిలో లైసెన్స్‌లు ఉన్న వారు ఎవరైన పట్టుకోవచ్చని మత్స్య శాఖ అధికారి కిరాంకర్ తెలిపారు. రాంపూర్ గ్రామ మత్స్యకారులు నాలుగు రోజులు, దస్తురాబాద్ గ్రామ మత్స్యకారులు రెండు రోజులు పట్టుకోవాలని మత్స్యశాఖ అధికారి సూచించారు. మత్స్యశాఖ అధికారి చెప్పిన విధంగా వినకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

# సర్టిఫికెట్లు అందజేత

ఉట్నూర్, మే28: ఉచిత బస్ హేవీ డ్రైవింగ్ పూర్తి చేసిన గిరిజన యువతకు శిక్షణ పత్రాలను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా బుధవారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉట్నూర్ ఐటీడీఏ, ఆర్టీసీ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువతకు హేవీ బస్‌డ్రైవింగ్ ఉచిత శిక్షణ అందించామన్నారు. కార్యక్రమంలో యూత్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# ధర్మసేవ ట్రస్ట్ సేవలు అభినందనీయం

నిర్మల్ చైన్‌గేట్, మే 28 : కేజీబీవీల్లో ధర్మసేవ ట్రస్ట్ నిర్వహిస్తున్న ధీర వెల్‌నెస్ కార్యక్రమం అభినందనీయమని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధర్మసేవ ట్రస్ట్ జిల్లాలోని ఆరు కేజీబీవీలలో నిర్వహించిన ధీర వెల్‌నెస్ కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధర్మసేవ ట్రస్టు ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఫిబ్రవరి 25 నుంచి ఏప్రిల్ 1 వరకు జిల్లాలోని 6 కేజీబీవీల్లో విద్యార్థుల నైపుణ్యాలు పెంచేందుకు పలు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జూన్ 26న ఇంటర్నేషనల్ డే డ్రగ్ అబ్యూస్ డే సందర్భంగా జిల్లాలోని డిగ్రీ కళాశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలో అన్ని ఉన్నత పాఠశాలలో ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే డ్రగ్ ఫ్రీ నిర్మల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి పరమేశ్వర్, సమన్వయకర్త లింబాద్రి, ధర్మసేవ మేనేజింగ్ ట్రస్టీ నిశాంత్‌రెడ్డి, ధీర ప్రోగ్రాం నిర్మల్ కోఆర్డినేటర్ ఎస్ స్రవంతి, డీసీవో గీత, ఏసీఎంవో శివాజీ, కేజీబీవీల ప్రత్యేకాధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి శిక్షణలో జిల్లా తపస్ బృందం

ఎదులాపురం, మే 28: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శ్రీ నీలకంఠ విద్యాపీఠంలో ఈ నెల 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి అభ్యాసవర్గ నిర్వహించారు. ఈ వర్గలో సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర.. విద్య ఆధారంగా జాతి నిర్మాణం, దేశ భక్తి, నూతన జాతీయ విద్యా విధానం, ఆదర్శ ఉపాధ్యాయుడు, విద్యార్థుల నిర్మారంలో ఉపాధ్యాయుల పాత్ర-21వ శతాబ్దంలో ఉపాధ్యాయుల పాత్ర అంశాలపై శిక్షణ ఇచ్చా రు. జాతీయస్థాయి వక్తలు పాల్గొని ఉపాధ్యాయులకు జాతీయ, అంతర్జాతీయ అంశాలపై దిశానిర్దేశనం చేశారు. తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చవాన్, ఆప్రికృష్ణ, మహిళా అధ్యక్షురాలు జిజాబాయి, మహిళా కన్వీనర్ సంగీత, నాయకులు వీరయ్య, రాజేశ్వర, ఉపేందర్, వినోద్, సమన్ పాల్గొన్నారు.



సాగు భూముల్లో కందకాల తవ్వకాలను అడ్డుకుంటున్న ఆటవీశాఖ అధికారులు



సమస్యను ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు ఫోన్‌లో తెలియజేస్తున్న రైతులు

# పోడు భూములే జీవనాధారం

బజార్‌హత్నూర్, మే 28: ఒకరిది ఉద్యోగ ధర్మం..మరోకరిది ఏండ్ల తరబడి భూమి కోసం పోరాటం ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం దిగ్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 155 కంపార్టుమెంట్ పరిధిలోని అటవీ భూముల్లో ఫారెస్టు అధికారులు గుంతలు తవ్వే కార్యక్రమం చేపట్టారు. దీంతో బుధవారం చిన్నమియతండా గ్రామస్తులు ఏళ్ల తరబడి ఈ పోడు భూములను నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనాధరం పొందుతున్నామని అలాంటి మా భూములను ఫారెస్టు అధికారులు అర్థంతరంగా లాక్కోవడం ఎంత వరకు సమజసమని ఒక వర్గానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని రైతులు ఎమ్మెల్యే జాదవ్ అనిల్ దృష్టికి ఫోన్‌లో సంప్రదించగా సంబంధిత ఇచ్చోడ ఫారెస్టు రేంజ్ అధికారితో మాట్లాడారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూముల జోలికి వెళ్లవద్దని ఆయన సూచించారు. ఇట్టి విషయంపై ఎఫ్ఆర్వో పుండలిక్‌ను నమస్తే తెలంగాణ ప్రశ్నించగా ఎవరైతే 2005 నుంచి పోడు భూములను సాగు చేస్తున్నారో అలాంటి భూములను గుర్తించి ఫారెస్టు పరిధిలోని తీసుకుంటున్నామని, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు లేని వారి భూములను మాత్రమే స్వాధీనం చేసుకున్నామే తప్ప ఏళ్ల తరబడి సాగు చేసే గిరిజనుల భూముల జోలికి వెళ్తలేమని ఆయన పేర్కొన్నారు. ఏది ఏమైనా ఏళ్ల తరబడి సాగుచేస్తూ జీవనాధరం పొందే రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

### సాగు భూములను వదులుకోం

ఖానాపూర్, రూరల్ 28 : మా ప్రాణాలు వదులుకుంటాం కానీ సాగు భూములను వదులుకోమని రైతులు మొరపెట్టుకున్న అటవీ శాఖ అధికారులు వినకుండా సాగు భూముల్లో రెండు రోజులుగా కందకా లు తవ్వుతున్నారు. ఖానాపూర్ మండలంలోని తర్లపాడు శివారులో పోడు రైతులపై అటవీ శాఖ అధికారులు జూలుం చూపిస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. 20 ఏండ్లుగా సాగులో ఉన్న భూముల్లో ట్రేంచ్, మొక్కల పెంపకానికి తవ్వకాలు చేపడుతున్నారని, తమ గోడును వినిపించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేశారు. పిల్లపాపలతో సహా 10 మంది కుటుంబాలు అక్కడికి చేరుకొని ఇదేమి దౌర్జ న్యం అంటూ అటవీ శాఖ అధికారులపై తిరగబడ్డారు. బాధిత కుటుంబాలకు మద్దతుగా రైతు సంఘాల నాయకులు అక్కడి చేరుకొని పనులు అడ్డుకున్నారు. అధికారులు సాగు భూముల్లో కందకాలు తవ్వుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ సీపీఎం నాయకులు నంది రామయ్య, దుర్గం నూతన్, తిరుపతి, శంభు, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

### ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

నర్సాపూర్ (జీ), మే 28 : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్ సూచించారు. నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జీ) మండలం గొల్లమాడలో డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యాన్ని మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించాలని ఆదేశించారు. కొనుగోళ్లలో జాప్యం చేయవద్దని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఈవో గణేశ్, రైతులు ఉన్నారు.

### నెలఖారులోపు రేషన్ బియ్యం సరఫరా చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, మే 28 : ఈ నెల 31వ తేదీలోగా మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం అన్ని చౌకధరల దుకాణాలకు సరఫరా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ తెలిపారు. బుధవారం స్టేజీ- 1, 2 కాంట్రాక్టర్లు, అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్‌కుమార్, జిల్లా మేనేజర్ సుధాకర్, మండల స్థాయి గిడ్డంగి అధికారులు, వివిధ మండలాలకు చెందిన రేషన్ షాపు సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

లక్ష్మణచాంద, మే 28: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా మండల ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ ప్రత్యూష పేర్కొన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద లోని ఎంపీడీవో కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నివారణపై మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీవో రాధ, ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### దడ్వాయిల సమస్యలు పరిష్కరించాలి

భైంసా, మే 28 : దడ్వాయిల సమస్యలు పరిష్కరించాలని దడ్వాయిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్ రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా భైంసాలోని బాంకెట్ హాల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా దడ్వాయిల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దడ్వాయిలకు కనీస వేతనం అందించాలన్నారు. అనంతరం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు మోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, భైంసా దడ్వాయిల సంఘం అధ్యక్షుడు సతీశ్ పాల్గొన్నారు.

### రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో రాణించాలి

ఎదులాపురం, మే 28 : హాకీ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో క్రీడాకారులు రాణించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని హాకీ ఆసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. జూన్ 8 నుంచి 11 వరకు ఆదిలాబాద్‌లో నిర్వహించే సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్‌కు జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. బుధవారం ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో క్రీడాకారులను పరిచాయం చేసుకుని ఎంపికను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలూరి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ హాకీలో జిల్లా క్రీడాకారుల అద్భుతంగా రాణిస్తున్నారని తెలిపారు. జూన్ 8 వరకు ఇక్కడే క్యాంప్ ఉంటుందన్నారు. క్రీడాకారులు వారి ప్రతిభతో పాటు మెలుకవలు నేర్చుకుంటు రాణిస్తూ జాతీయ స్థాయికి ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి, కోచ్‌లు రవీందర్, గోవింద్, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి క్రీడాకారునికి ఆర్థిక సాయం

నిర్మల్ అర్బన్, మే 28 : జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైన అభినయనను నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి బుధవారం అభినందించారు. జూన్ 4 నుండి 7 వరకు గోవా రాష్ట్రంలో జరుగనున్న జాతీయ స్థాయి జూనియర్ అండర్-17 బాలికల బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్న నేపథ్యంలో రూ.10 ఆర్థిక సాయం అందజేశారు. జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు.

# అత్యవసర పరిస్థితుల్లో 18004251939

ఎదులాపురం, మే 28 : భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ నంబర్ 18004251939 ఏర్పాటు చేశామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆస్తి నష్టం కలగకుండా అధికారులు హెడ్ క్వార్టర్‌లో ఉండి పర్యవేక్షించాలని సూచించారు. వర్షాల కారణంగా ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా వర్షాల కారణంగా ఏర్పడే వరదలు, వంకలు ఉప్పొంగిపోతే రోడ్లు, వంతెనలు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన పాత ఇళ్లు వర్షాలకు నాని కూలిపోయే ప్రమాదం ఉన్నదని, అక్కడ నివసించే వారిని ఖాళీ చేయించాలన్నారు. ఐరన్ విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లు ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల జరిగే ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని , రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని మున్సిపల్ శాఖ అధికారులకు హితవుపలికారు. అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ఆపదమిత్ర శిక్షణ పొందిన వలంటీర్లను వినియోగించుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని ప్రభుత్వ దవాఖానల్లో సిబ్బంది అందుబాటులో ఉండి అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. అత్యవసర పరిస్థితులో కంట్రోల్ నంబర్‌కు కాల్ చేయాలని ప్రజలను కలెక్టర్ కోరారు.

### ఆదివాసీల శాశ్వత అభివృద్ధికి పీఎం జన్మన్, ధర్తి అభాపై సమీక్ష

ఆదివాసీల శాశ్వత అభివృద్ధికి పీఎం జన్మన్ (ప్రధాన్ మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్), ధర్తి అభా పథకాలపై అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ రాజర్షి షా సమావేశం నిర్వహించారు. జూన్ 15 నుంచి 30 వరకు జిల్లాలో అన్ని ఆదివాసీ కుటుంబాలు ఈ పథకాల ద్వారా కవర్ కావాలనే లక్ష్యంతో సత్రేషన్ డ్రైవ్ ప్రారంభించాల్సిన అవసరాన్ని వివరించారు.



మురుగు నీటిలో నిలబడి నిరసన తెలుపుతున్న ఎస్సీ కాలనీ వాసులు

### మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని నిరసన

భైంసాటౌన్, మే 28 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని కోతుల్‌గాం దళితవాడలో మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని బాధిత కుంటుంబ సభ్యులు బుధవారం సాయంత్రం మురుగు నీటిలో నిలబడి నిరసన తెలిపారు. గ్రామ కార్యదర్శి, ప్రత్యేకాధికారి, ఎంపీడీవో,ఎంపీవోలకు సమస్య పరిష్కరించాలని కోరిన పట్టించుకోవడం లేదని వాపోయారు. గ్రామంలో కాకుండా చెరువు మధ్యలో నివసిస్తున్నట్లు ఉందని కాలనీ వాసులు అన్నారు.

# మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు

దస్తురాబాద్,మే28 : మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని ఆకొండపేట గ్రామంలో బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. 62 ద్విచక్ర వాహనాలకు జరిమానా విధించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఐ అజయ్, ఎస్ఐలు సాయి కుమార్, కృష్ణాసాగర్ రెడ్డి, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.